

హామీలను అమలు చేయాలి

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో ▸



ఎర్రజొన్న కోతలు షురూ

ఎర్రజొన్న కోతలు ప్రారంభమయ్యాయి. క్వింటాల్‌కు రూ.ఐదు వేలు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.6 /19.0

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు కాస్త పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు గురువారం(నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల కోసం జిల్లా ఇంటర్ అధికారులు ఏర్పాట్లు చేశారు. జనరల్ విద్యార్థులకు 55 పరీక్ష కేంద్రాలు, ఒకేషనల్ విద్యార్థులకు 20 పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించి పరీక్షల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు.

నేడు స్తంభం పరీక్షలు

నిజామాబాద్‌నాగారం: జేఎల్‌ఎం అభ్యర్థులకు గురువారం స్తంభం పరీక్షలు నిర్వహించనున్నారు. నాలుగో విడతలో ఉమ్మడి జిల్లాలో 33 మంది జూనియర్ లైన్‌మన్‌గా ఎంపికయ్యారు. వీరికి ఉదయం 10.30గంటల నుంచి విద్యుత్ కార్యాలయం ఆవరణలో సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో స్తంభం పరీక్షలు నిర్వహించనున్నారు.

ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్‌కు సన్మానం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శాసనమండలి సభ్యుడిగా బుధవారం ప్రమాణస్వీకారం చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఛాంబర్‌లో, రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, అగ్గు భోజన్న, విపుల్‌గౌడ్, సుభాష్ యాదవ్ సన్మానం చేసినవారిలో ఉన్నారు.

స్టాఫ్‌నర్సులకు నియామక పత్రాలు



నిజామాబాద్ నాగారం: నర్సింగ్ ఆఫీసర్‌కు సంబంధించిన అభ్యర్థులు ఆర్డర్ కాపీల కోసం బుధవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో సుదర్శనం ఆధ్వర్యంలో నర్సింగ్ అభ్యర్థులను ప్రత్యేక బస్సుల్లో తరలించారు. పాత కలెక్టరేట్ మైదానంలో అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. జిల్లాలోని 380 మంది నర్సింగ్ అభ్యర్థులు వెళ్లారు. వీరికి ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు.

శీలం జానకీబాయి విగ్రహావిష్కరణ




ఇందల్వాయి: నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం సిర్నాపల్లి గ్రామంలో బుధవారం సిర్నాపల్లి గడీ సంస్థానాధీశురాలు రాణి శీలం జానకీబాయి విగ్రహాన్ని ఆమె ముని మనవరాలు అనురాధ రెడ్డి ఆవిష్కరించారు. అలాగే గడిలోని పైఅంతస్తులో దాతల సాయంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని తహసీల్దార్ వెంకట్‌రావు, డిచ్‌పల్లి సీఐ మల్లేష్‌తో కలిసి అనురాధరెడ్డి ప్రారంభించారు. రాణి జానకీబాయి విగ్రహాన్ని గ్రామస్తులు సుమారు లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయడం గర్వకారణమని, గడీ పునరుద్ధరణకు, గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన వారందరికి సర్పంచ్ తేలు విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అనురాధరెడ్డి మాట్లాడుతూ.. తమ తాతమ్మ జానకీబాయి సేవలకు గుర్తుగా విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. అనురాధరెడ్డిని సిర్నాపల్లి గ్రామస్తులు సత్కరించారు. తహసీల్దార్ వెంకట్‌రావు, సీఐ మల్లేష్, సర్పంచ్ విజయ్, ఎంపీటీసీ అశ్విని, ఉప సర్పంచ్ నవీన్ గౌడ్, హెడ్‌మాస్టర్ శ్రీధర్, వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ నేపథ్యంలో గురువారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో జిల్లాకు లబ్ధి చేకూర్చే నిర్ణయాలు, నిధుల కేటాయింపుపై ప్రజల్లో ఆశలు నెలకొన్నాయి. ముఖ్యంగా శాసనసభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి ప్రకటించిన పసుపు బోర్డును పంట ఎక్కువగా పండించే ఇందూరులోనే నెలకొల్పాలని రైతుల నుంచి డిమాండ్లు ఉన్నాయి. బడ్జెట్‌లో పసుపు బోర్డుకు సంబంధించి నిధుల కేటాయింపు, నెలకొల్పే స్థలంపై ఆసక్తి నెలకొంది.

పసుపు బోర్డు ఇక్కడేనా?

- ఇందూరులో ఏర్పాటుపై రైతుల్లో ఆసక్తి
- ఆర్మూర్ నుంచి నిర్మల్, ఆదిలాబాద్ రైల్వేలైన్ ప్రకటనపై ఆశలు
- గల్ఫ్ వలస కార్మికుల పాలసీ కోసం ఎదురుచూపులు
- ఎన్‌ఎస్‌ఎఫ్, ఎన్‌సీఎస్‌ఎఫ్ లను పునఃప్రారంభించాలని డిమాండ్లు
- లక్కంపల్లి సెజ్‌లో ఆగ్రో యూనిట్ల ఏర్పాటు జరిగేనా..
- నేడు పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మల







నిర్మలమ్మ పద్దుపై ఆశలెన్నో..

■ ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లోని 32 నియోజకవర్గాల్లో లక్షల సంఖ్యలో గల్ఫ్ వలస కార్మికులు ఉన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక పాలసీ కోసం చాలాకాలంగా డిమాండ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కార్మికుల కుటుంబాలు లక్షలాది కళ్లతో ఎదురుచూస్తున్నాయి. ఎన్నికల్లో ఈ కుటుంబాల ప్రభావం ఎక్కువగా ఉండనుంది.

■ నందిపేట మండలంలోని లక్కంపల్లిలో 429 ఎకరాల్లో ఉన్న సెజ్ (ప్రత్యేక ఆర్థిక మండలి)లో వ్యవసాయ, అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పలువురు చెబుతున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ ఏర్పాటుపై అనేక ఏళ్ల నుంచి డిమాండ్ ఉంది. యూపీఏ ప్రభుత్వం హయాంలోనే ఈ లైన్ సర్వేకు సంబంధించి నిధులు ఇస్తామని అప్పటి బడ్జెట్‌లో ప్రకటించారు. అయితే ఇప్పటివరకు ముందుకు పడలేదు. ఈ లైన్ ఆదిలాబాద్–నిర్మల్–ఆర్మూర్–డిచ్‌పల్లి మీదుగా పటాన్‌చెరువు వరకు గతంలో ప్రతిపాదన ఉంది. ఈ క్రమంలో గత సెప్టెంబర్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేసిన ప్రకటన మరిన్ని ఆశలు పెంచింది. రూ.5,706 కోట్లతో ఆదిలాబాద్–నిర్మల్–ఆర్మూర్–నిజామాబాద్–బోధన్–బాన్సువాడ–నిజాంపేట–సంగారెడ్డి–పటాన్‌చెరువు లైన్‌కు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయంలో తాజా బడ్జెట్‌పై ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా వాసుల్లో ఆశలు పెరిగాయి. ఇక ఆర్మూర్ రైల్వేస్టేషన్‌కు ఇప్పటివరకు రోడ్డు సౌకర్యం లేదు. ఈసారైనా దీనికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఇక నిజామాబాద్–ఆర్మూర్–కరీంగనర్–కాగజ్‌నగర్ లైన్‌లో రైళ్లు పెంచాలని కోరుతున్నారు.

తీపి కబురు అందేనా..

■ బోధన్‌లోని ఎన్‌ఎస్‌ఎఫ్, సారంగాపూర్‌లోని ఎన్‌సీఎస్‌ఎఫ్ చక్కెర యూనిట్లను ప్రారంభించాలని డిమాండ్లు ఉన్నాయి. వీటితో ఉమ్మడి జిల్లాలో ఎకానమీ పెరుగుతుందని అంటున్నారు. వీటితో పాటు జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీని, డిచ్‌పల్లి వద్ద భారీ వస్తు తయారీ పరిశ్రమను నెలకొల్పాలని డిమాండ్లు ఉన్నాయి. అదేవిధంగా డ్రైపోర్ట్, కంటెయినర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో లాజిస్టిక్ ఫ్రైట్ డిపో ఏర్పాటు చేయాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపులు చేస్తేనే ఇవి సాధ్యం. గతంలో జిల్లాలోని జానకంపేట వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.700 కోట్లతో ఇథనాల్ ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు కేంద్రం నిర్ణయించగా, కేసీఆర్ ప్రభుత్వం భూమి ఇవ్వకపోవడంతో సదరు ఇథనాల్ ఫ్యాక్టరీ హర్యానాకు తరలివెళ్లింది. ఇక్కడే నెలకొల్పే విషయమై ఐటీసీ ఈడీ రెండుసార్లు జిల్లాకు వచ్చి వెళ్లారు. అయినప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు.



'పసుపు బోర్డు'కు అనువైన స్థలాలు



దేశ వ్యాప్తంగా సాగయ్యే పసుపులో అత్యధిక శాతం నిజామాబాద్ జిల్లాలోనే సాగు అవుతుంది. ఈ నేపథ్యంలో పసుపు బోర్డును జిల్లాలోనే ఏర్పాటు చేయాలి. బోర్డు ఏర్పాటుకు జిల్లాలో అనువైన స్థలాలు ఉన్నాయి. పసుపు బోర్డు ఇక్కడ ఏర్పాటు చేస్తేనే రైతుల ఆకాంక్షలు నెరవేరుతాయి. – సంజీవరెడ్డి, రైతు, నాయకుడు, దొన్కల్

జీఎస్‌టీ తిరిగి చెల్లింపులో ఆలస్యం వద్దు



వస్తు సేవల పన్ను విషయంలో కేంద్రం ప్రతినెల మార్పులు తెస్తోంది. అయితే వ్యాపారులకు తిరిగి చెల్లింపు విషయంలో మాత్రం 6 నెలల వరకు ఆలస్యం చేస్తున్నారు. వారం రోజుల్లోనే తిరిగి ఇవ్వాలి. దీంతో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రెన్యూయర్‌లు వడ్డీ నష్టపోకుండా ఉంటారు. ఆదాయ పన్ను మినహాయింపులు పెంచాలి. జిల్లాలో బోధన్, సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలి. చెరుకు పిప్పితో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను నెలకొల్పాలి. హైదరాబాద్–నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి డిచ్‌పల్లి వద్ద తయారీ యూనిట్లు నెలకొల్పాలి. – నల్ల దినేష్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, నిజామాబాద్

బడ్జెట్‌లో ప్రతిసారి నిరాశే..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గత బడ్జెట్‌లలో ప్రతిసారి వేతన జీవులకు నిరాశే ఎదురైంది. ఆదాయపన్ను పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని, కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు సూచించినా అమలు చేయటం లేదు. రెండు రకాల పన్ను విధానం కాకుండా అందరికీ ఒకే విధంగా ఉండాలి. 80సీ మినహాయింపులను రూ.1.50 లక్షల నుంచి కనీసం రూ.3 లక్షలకు పెంచాలి. విద్యాసెస్‌ను 4 శాతం నుంచి 2 శాతానికి తగ్గించాలి. వేతన జీవులు కట్టే పన్ను కార్పొరేట్ పన్ను కంటే ఎక్కువగా ఉండటం సమంజసం కాదు. – కే రవీందర్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, తెయూ

మార్పులు ఉండకపోవచ్చు



2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆదాయపు పన్ను స్లాబుల్లో పెద్దగా మార్పులేవీ ఉండకపోవచ్చు. అల్ప, మధ్యాదాయ, వేతన జీవులకు ఊరట కల్పించుటకు ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) పరిమితిని కనీసం రూ.లక్షకు పెంచాలి. సెక్షన్ 80 సి కింద రూ.1.50లక్షల వరకు పన్ను మినాయింపు ఇస్తున్నారు. దీనిని రూ.3 లక్షల వరకు పెంచినట్లయితే పొదుపు రేట్లు పెరుగుతాయి. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి. – పున్నయ్య, విభాగాధిపతి, అర్థశాస్త్రవిభాగం, తెయూ

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

- 45 రోజుల్లో 30 టీఎంసీలు ఖాళీ
- సీజన్‌కు కేటాయింపు 60 టీఎంసీలు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. ప్రస్తుత యాసంగి సీజన్‌కు కేటాయించిన నీటి కోటాలో సగం ఖాళీ అయింది. ఈ సీజన్‌కు 60 టీఎంసీల నీటిని ప్రభుత్వం కేటాయించింది. నీటి విడుదల ప్రారంభ సమయంలో ప్రాజెక్ట్‌లో 78 టీఎంసీల నీరు ఉంది. డిసెంబర్ 18 నుంచి కాలువల ద్వారా నీటి విడుదలను ప్రారంభించారు. 45 రోజుల్లోనే 30 టీఎంసీల నీరు ఖాళీ అయింది. మార్చి చివరి వరకు నీటి సరఫరా చేపట్టాలని ప్రణాళికలో పేర్కొన్నారు. ఈ లెక్క ప్రకారం మరో 60 రోజులు నీటిని విడుదల చేయాలి. దీంతో ఉన్న నీరు సరిపోతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువల ద్వారా నిరంతరం నీటి విడుదల జరుగుతోంది. వారబందీ సరిగా అమలు కావడం లేదు. కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు వదలాలని ప్రణాళికలో పేర్కొనలేదు. కాని 6 వేల క్యూసెక్కుల కంటే ఎక్కువగానే కొన్ని రోజులు వదిలారు.

గతేడాది కంటే తక్కువ..

ఈ ఏడాది యాసంగి సీజన్ ప్రారంభమయ్యే సమయంలో ప్రాజెక్టులో గతేడాది కంటే 10 టీఎంసీల నీరు తక్కువగా ఉంది. తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు, డెడ్‌స్టోరేజీ 5 టీఎంసీలు, ఆవిరి రూపంలో 5 టీఎంసీలు పోను మిగిలిన నీరు 63 టీఎంసీలు మాత్రమే. అందులో నుంచి 60 టీఎంసీలు యాసంగి పంటలకు కేటాయించారు. ఇందులో 30 టీఎంసీలు అయిపోయాయి. రానున్న కాలంలో ఎండలు పెరుగుతాయి. దీంతో ఆవిరి రూపంలో ఎక్కువ నీరు పోయే అవకాశం ఉంది. పంటలకు కూడా నీరు ఎక్కువగా అవసరం అవుతుంది. దీంతో కేటాయించిన నీటిలో మిగిలిన 30 టీఎంసీలు సరిపోయే పరిస్థితి కనిపించడం లేదు.

కొనసాగుతున్న నీటి విడుదల

ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 250 క్యూసెక్కులు, గుత్ప లిఫ్టు ద్వారా 270 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఆవిరి రూపంలో317 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌లో బుధవారం సాయంత్రానికి 1078.30(48 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.



గొల్లపల్లిలో 30 మందికి విషజ్వరాలు

డిచ్‌పల్లి: మండలంలోని గొల్లపల్లిలో రెండు రోజులుగా 30 మందికిపైగా విషజ్వరాలతో బాధపడుతున్నారని సర్పంచ్ గుడాల లింగం తెలిపారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. విషజ్వరాలకు కారణం తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వైద్యాధికారులు వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని కోరారు.



రేపటి నుంచి 'ప్రత్యేక పాలన'

- నేడు జారీ కానున్న ఉత్తర్వులు
- జాబితాను సిద్ధం చేసిన అధికారులు
- 'డిజిటల్ కీ'లను స్వాధీనం చేసుకోవాలని ఆదేశం

మోర్తాడ్: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం నేటితో ముగియనుంది. ఇప్పట్లో ఎన్నికలను నిర్వహించే అవకాశం లేకపోవడంతో ఫిబ్రవరి రెండో తేదీ(శుక్రవారం) నుంచి ప్రత్యేకాధికారుల పాలన ఆరంభం కానుంది. దీని కోసం గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల జాబితాను పంచాయతీ అధికారులు సిద్ధం చేశారు. ఇందులో ప్రత్యేకాధికారులుగా ఎంపికైన వారికి గురువారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఉత్తర్వులు అందజేయనున్నారు. మేజర్ పంచాయతీలకు గెజిటెడ్ అధికారులను, చిన్న పంచాయతీలకు జనాభా ఆధారంగా సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌లను నియమించాలని నిర్ణయించారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఇంజినీర్లు, ఎంఈవో, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులతో పాటు వివిధ కార్యాలయాలలోని సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రత్యేకాధికారుల జాబితాను కలెక్టర్ కార్యాలయానికి అందించారు.



జాయింట్ చెక్ పవర్

స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్ పవర్ కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆర్థిక సంఘం, ఎస్‌ఎఫ్‌సీ, పంచాయతీ జనరల్ ఫండ్‌లను వినియోగించడానికి ఇప్పటి వరకు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు జాయింట్ చెక్ పవర్ ఉండేది. ఇక నుంచి ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శులకు ఈ చెక్ పవర్ కొనసాగనుంది. ఇది ఇలా ఉండగా సర్పంచ్, ఉప సర్పంచ్‌ల వద్ద ఉన్న డిజిటల్ కీలను స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులు కార్యదర్శులను ఆదేశించారు. గురువారంతో పదవీ కాలం ముగిసిపోనున్న నేపథ్యంలో ఆ రోజు వరకు డిజిటల్ కీలను స్వాధీనం చేసుకోవడానికి కార్యదర్శులు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సమాచారం అందించారు.

మత్తు పదార్థాల నిరోధానికి కృషి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: యువత, విద్యార్థుల భవిష్యత్‌ను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల తయారీ, వాటి వినియోగం, రవాణా తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాల గురించి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి జిల్లాకు వస్తున్నాయో కనిపెట్టాలని ఆదేశించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిరోధానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. జిల్లాలో మత్తు పదార్థాలు వినియోగం ఆందోళన కలిగించే స్థాయిలో ఉందన్నారు. అల్ప్రాజోలం వినియోగంలో రాష్ట్రంలో జిల్లా మొదటి మూడు స్థానాల్లో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు గంజాయిని చేరవేస్తూ విక్రయాలు జరుపుతున్నారని, అలాంటి వారిపై నిఘా పెట్టి దాడులు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల ద్వారా కూడా స్మగ్లర్లు గంజాయి రవాణా చేసే అవకాశాలు ఉన్నందున నిఘా ఉంచామన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరందు, అదనపు డీసీపీ జయరాం, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య, ఆర్డీవో రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, డీటీసీ వెంకటరమణ, ఐబీ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ప్రమాదాల నివారణకు చర్యలు

సుభాష్‌నగర్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. జిలా జిల్లా మీదుగా నాలుగు ప్రధాన జాతీయ రహదారులు వెళ్తుండడంతో హైవేలపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ, యాక్సిడెంట్లకు దారి తీస్తున్న కారణాలను గుర్తించాలన్నారు. అవసరం ఉన్న చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ నగరం, ఇతర పట్టణాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. 2023 సంవత్సరంలో జిల్లాలో 767 రోడ్డు ప్రమాద ఘటనలు చోటుచేసుకుని 337 మంది మరణించారని, 203 మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. అత్యధికంగా డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులకు రవాణా శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్‌లు పంపిణీ చేశారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, అదనపు డీసీపీ జయరాం, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్ కుమార్, పంచాయతీరాజ్ అధికారులు బావన్న, శంకర్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కబ్జా చేస్తే చర్యలు



సాక్షి ఎఫెక్ట్‌..

బాల్కొండ: ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ సర్వే గందం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సర్వే నంబరు 1333లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురి కావడంపై సాక్షి దినపత్రిలో మంగళవారం ప్రచురితమైన 'కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి' అనే కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. దీంతో ప్రభుత్వ భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హద్దులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్‌ శ్రీధర్‌, ఈవో రజనీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ రాఘవేందర్‌ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పీజీ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో పీజీ మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్‌ 5వ రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఆచార్య ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. బుధవారం ఉదయం పరీక్షకు 900కి 850 మంది హాజరు కాగా 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 158 మందికి 157 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు.

వేలానికి నోచుకోని బైక్‌లు



బోధన్‌టౌన్‌: తప్పుడు కేసుల్లో బైక్‌లు పోలీసులకు చిక్కితే అంతే సంగతి. కేసు పూర్తయ్యే వరకు చేతికి రావు. బోధన్‌ డివిజన్‌ పరిధిలోని పీఎస్‌లలో వంద సంఖ్యలో బైక్‌లు పేరుకుపోయాయి. ఈ డివిజన్‌లో పట్టణ పోలీస్‌స్టేషన్‌తో పాటు 6 పీఎస్‌లు, రెండు సర్కిల్‌ కేంద్రాలు ఉన్నాయి. డివిజన్‌ కేంద్రానికి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలు ఆనుకొని ఉండడంతో నేరాలతో పాటు మట్కా, పేకాట, గంజాయి, అక్రమంగా బియ్యం రవాణా కేసులు నమోదవుతున్నాయి. డివిజన్‌లో ఈ 7 పీఎస్‌లలో సుమారు 300 వరకు వాహనాలు ఏళ్ల తరబడి ఉన్నాయి. పీఎస్‌లలో తనిఖీల పేరిట పోలీసు ఉన్నతాధి కారులు వచ్చినా వాహనాల పరిస్థితి మాత్రం మారడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. అధికారులు స్పందించి వాహనాలను వే లం వేస్తే కొంత ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రైస్‌మిల్లర్లు



నిజాంసాగర్‌: జుక్కల్‌ నియోజకవర్గ రైస్‌మిల్‌ అసోషియేషన్‌ సభ్యులు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రైస్‌ మిల్లుల నిర్వాహకులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లక్ష్మణ్‌, అనిల్‌, కొల్లవార్‌ సంజీవు, మారుతిరెడ్డి ఉన్నారు.

వీడీసీపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాం(పి) వీడీసీపై కేసు నమోదైనట్లు నాలుగో టౌన్‌ ఎస్సై సంజీవ్‌ బుధవారం తెలిపారు. మార్కండేయ మందిరానికి సంబంధించి స్థల వివాదంలో పద్మశాలీ తర్ప–1కు చెందిన 36 మందిని వీడీసీ బహిష్కరించింది. దీంతో అదే తర్పకు చెందిన సంఘ సభ్యుడు ఆనంద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎర్రజొన్న కోతలు షురూ..

- క్వింటాలుకు రూ. ఐదు వేల వరకు పలుకుతున్న ధర
- రైతులకు శాపంగా మారిన వ్యాపారుల గత ఒప్పందం
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటున్న రైతులు



రెంజర్లలో రోడ్డుపై ఆరబెట్టిన జొన్నలు

బాల్కొండ: ఎర్రజొన్న కోతలు నియోజకవర్గంలోని పలు మండలాల్లో ప్రారంభమయ్యాయి. వాణిజ్య పంట అయిన ఎర్రజొన్న కోతలను ముప్కాల్‌, మెండోరా, బాల్కొండ మండలాల్లో రైతులు గత రెండు రోజుల నుంచి ప్రారంభించారు. నవంబర్‌లో వేసిన ఈ పంట 120 రోజుల్లో చేతికందుతుంది. ముందస్తుగా సాగు చేసిన రైతులు కోతలు ప్రారంభించారు. ప్రస్తుత సీజన్‌లో ఎర్రజొన్న పంట సాగుకు ముందస్తుగానే ప్రభుత్వం వ్యాపారుల నుంచి బై బ్యాక్‌ ఒప్పందాలను చేసుకోవాలని సూచించింది. గతంలో ఎర్రజొన్నల కొనుగోలు కోసం రైతులు రోడ్లపై ధర్నాలు చేశారు. ప్రస్తుత ఏడాది ఈ పంటకు ముందస్తుగానే వ్యాపారుల వద్ద రైతులు ఒప్పందాలు చేసుకున్నారు. క్వింటాలుకు రూ. 4వేల నుంచి రూ. 4500 వరకు పలు గ్రామాల్లో వ్యాపారులతో ఒప్పందాలు చేసుకున్నారు. కానీ ఈ ఏడాది మార్కెట్‌లో ఎర్రజొన్నకు డిమాండ్‌ అధికంగా ఉంది. దశాబ్ద కాలం వరకు రైతులు ముందస్తుగా ఒప్పందాలు చేసుకునే ఈ పంటను సాగు చేశారు. ఆ ఒప్పందాలే రైతుల పాలిట శాపంగా మారాయి. ఒప్పందం చేసుకున్న ధర కంటే ఎక్కువగా మార్కెట్‌లో ధర పలికినా ఒప్పంద ప్రకారం అదే ధరను చెల్లిస్తున్నారు. కొందరు రైతులు ఒప్పందాలు లేకుండా జొన్న పంటను సాగు చేశారు. క్వింటాలుకు రూ. 5 వేల వరకు ధరను పొందారు. కానీ వ్యాపారుల సిండికేట్‌ కావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. చివరికి క్వింటాలుకు రూ.1200 తగ్గించారు. దీంతో ప్రభుత్వమే ఎర్రజొన్న విత్తనాలను సరఫరా చేసి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సిండికేట్‌గా మారితే ఇబ్బందులు



ఎర్రజొన్న పంట కోతలను కోస్తున్నాం. వ్యాపారులు సిండికేట్‌గా మారకుండ క్వింటాలుకు రూ. 5 వేలు చెల్లించాలి. ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తే రైతు నష్టపోకుండా ఉంటాడు.
– ముత్యంరెడ్డి, రైతు

గణితంతో జీవనశైలి సులభతరం

రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): జీవనశైలిని సులభతరం, సౌకర్యవంతంగా మార్చుకోవడానికి గణితం మంచి అస్త్రంగా ఉపయోగపడుతుందని రూరల్‌ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. తెలంగాణ గణిత ఫోరం– నిజామాబాద్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్షను రెండు దశల్లో నిర్వహించారు. ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీనివాసరామానుజన్‌ లాంటి గణిత మేధావి పరిశోధనల వల్లే భారతదేశ గణిత, సాంస్కృతిక విలువలు పెరిగాయన్నారు. ఇలాంటి పోటీ పరీక్షలతో మనస్థాయి పెరుగుతుందన్నారు. తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి మాట్లాడుతూ.. పిల్లలు ఏ స్థాయిలో ఉన్నా మానవత్వాన్ని, నైతిక విలువలను పాటించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే, రిజిస్ట్రార్‌లు రాష్ట్ర స్థాయి సహిత ప్రతిభా పరీక్ష పోటీల ఫలితాలను ఆవిష్కరించి విజేతలుగా బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు మొదటి దశ సమావేశంలో జిల్లా పరిషత్‌ చైర్మన్‌ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ.. లెక్కలు నేర్చుకుంటే జీవనసారపు చిక్కు లెక్కలు కూడా సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం నూతనంగా గణిత ఉపాధ్యాయులుగా పని చేసి హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన 30 మందిని సన్మానించారు. కార్యక్రమంలో నగర మేయర్‌ నీతూకిరణ్‌, తెయూ ప్రిన్సిపాల్‌ ఆరతి, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు కాంతారావు, ప్రధాన కార్యదర్శి కృష్ణ, గౌరవఅధ్యక్షుడు చంద్రశేఖర్‌, రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్రస్వామి, టి.శ్రీనివాస్‌, పున్నారావు, శ్యాంసుందర్‌, గోపాలకృష్ణ, మైకేల్‌, కిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కాంగ్రెస్‌ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



లక్కోరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్‌: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పార్లమెంట్‌ ఎన్నికల లోగా అమలు చేయాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లక్కోరలో పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్‌ పార్టీని ప్రజలు బొంద పెట్టడం ఖాయమని అన్నారు. దేశంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చే పరిస్థితులు లేవన్నారు. కేవలం 1.8 శాతం ఓట్ల తేడాతో మాత్రమే బీఆర్‌ఎస్‌ ఓడిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే రూ. 14 వేల కోట్ల అప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలన్నారు.

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 24 గంటల నాణ్యమైన కరెంట్‌ ఇచ్చిన ఏకైక వ్యక్తి కేసీఆర్‌ అని అన్నారు. హామీల అమలుపై నిలదీస్తే కాంగ్రెస్‌ నేతలు సమాధానం చెప్పలేక ఆక్రోశంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు మధుశేఖర్‌, కోటపాటి నర్సింహానాయుడు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



నిజామాబాద్‌అర్బన్‌: విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌ అన్నారు. అన్నారు. నగరంలోని న్యూఅంబేద్కర్‌ భవన్‌లో పదోతరగతి విద్యార్థులకు బుధవారం అవగాహన, ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. వసతి గృహాల్లోని విద్యార్థులు మంచి మార్కులు సాధించి భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి సంక్షేమ శాఖ నుంచి మెటీరియల్‌ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భయాన్ని వీడి శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు నర్సయ్య, గంగా కిషన్‌, ఉపాధ్యాయులు శారద, శ్రీనివాస్‌, అరవింద్‌, సతీశ్‌రెడ్డి, లక్ష్మీనాథ్‌, రమేశ్‌, మురళీధర్‌ పాల్గొన్నారు.

కృష్ణమందిర్‌లో వైభవంగా పూజలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నగరంలోని వర్ని రోడ్డులోని అటవీశాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ మందిర్‌లో వైభవంగా పూజలు నిర్వహించారు. మహారాష్ట్రలోని అకోలా జిల్లా నుంచి పరమాహంస ప్రతిష్టన్‌ భవన్‌ వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవాన్‌ భక్త బృందం ద్విచక్ర వాహన తీర్థయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ యాత్ర బుధవారం తెలంగాణలోని ప్రముఖ తీర్థ క్షేత్రాలను సందర్శించే దాంట్లో భాగంగా ఇందూరుకు వచ్చింది. ఈ సందర్భంగా హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్‌ కదం ఆధ్వర్యంలో బైక్‌ ర్యాలీకి స్వాగతం పలికారు. ఇందులో భాగంగా అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్‌ కదం, విశ్వహిందూ పరిషత్‌ జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్‌, బబ్లు, గజానంద్‌, శైలేష్‌, బాబు, బినయ్‌ పాల్గొన్నారు.



శ్రీకృష్ణ మందిర్‌లో పూజలు చేస్తున్న దృశ్యం

మీడియాలో మార్పు రావాలి

నిజామాబాద్‌అర్బన్‌: సమాజంలో ఏ మార్పు రావాలన్న ముందు మీడియాలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, అందుకోసం దళిత జర్నలిస్ట్‌లు ముందు వరుసలో ఉండి పని చేయాలని అంతర్జాతీయ దళిత జర్నలిస్ట్స్‌ నెట్‌వర్క్‌ (ఐడీజేఎన్‌) వ్యవస్థాపక చైర్మన్‌ మల్లేపల్లి లక్ష్మయ్య పిలుపునిచ్చారు. నగరంలో బుధవారం దళిత జర్నలిస్ట్స్‌ ఎడ్యుకేషనల్‌ అండ్‌ వెల్ఫేర్‌ సొసైటీ, దళిత జర్నలిస్ట్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దళిత మీడియా దినోత్సవ సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు బుద్ధుడు, అంబేద్కర్‌ చిత్రపటాలకు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. లక్ష్మయ్య మాట్లాడుతూ.. ఐడీజేఎన్‌లో ఏ జర్నలిస్టు అయిన పనిచేయవచ్చని, కులమతాలకు అతీతంగా పని చేస్తున్నామని తెలిపారు. దళిత జర్నలిస్టులకు సలాంధ్ర అవార్డును ప్రకటిస్తామని, ఎంపిక అయిన వారికి రూ.10 వేల బహుమతి ఇస్తామని తెలిపారు. మేయర్‌ నీతూకిరణ్‌ మాట్లాడుతూ.. దళిత జర్నలిస్ట్స్‌ కోసం ఐడీజేఎన్‌ కృషిని అభినందించారు. సంస్థ ప్రతినిధులు పాకాల నర్సింలు, మంద జనార్దన్‌, ఎడ్ల సంజీవ్‌, నాగరాజు, రామకష్ణ, సుభాష్‌, సాగర్‌, సాయిరాం, శంకర్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లెపల్లి లక్ష్మయ్య, నీతూకిరణ్‌

కేంద్ర బడ్జెట్‌పై..



పార్లమెంట్‌లో నేడు కేంద్ర మంత్రి నిర్మల బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా జిల్లా అంశాలపై పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

రాయితీలు ఇవ్వాలి



గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ఏదో ఒక మేలు జరిగింది. కానీ ప్రభుత్వ ఉద్యోగులు, వేతన జీవులకు ఎలాంటి టాక్స్‌ రాయితీలు ఇవ్వలేదు. కొత్త టాక్స్‌ విధానంతో ఎలాంటి లాభాలు లేవు. ప్రస్తుతం దేశంలో తమ ఆదాయానికి సరైన ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారు ఉద్యోగులు మాత్రమే.
– పాత నాగరాజు, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, తెయూ

నిధులు కేటాయించాలి



కేంద్ర బడ్జెట్‌లో వలస కార్మికు ల సంక్షేమానికి నిధులను కేటాయించాలి.వారి సంక్షేమంపై ఏ ప్రభుత్వం ఇప్పటి వరకు దృష్టి సారించలేదు. వలస కార్మికుల ద్వారా ప్రభుత్వానికి భారీగా విదేశీ మారకద్రవ్యం జమ అవుతుంది. దేశ ప్రగతిలో వలస కార్మికుల కృషి ఎంతో ఉంది. నిధులు కేటాయించకపోతే వారికి అన్యాయం జరిగినట్లే.
– మంద భీంరెడ్డి, గల్ఫ్‌ వ్యవహారాల విశ్లేషకులు

డాక్టరేట్‌ పొందినందుకు ఆనందంగా ఉంది



నిజామాబాద్‌నాగారం: సమాజ సేవకు గుర్తింపుగా ఆసియా ఇంటర్నేషనల్‌ కల్చరల్‌ రీసెర్చ్‌ యూనివర్సిటీ వారు అందించిన డాక్టరేట్‌ అందుకోవడం సంతోషంగా ఉందని స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య అన్నారు. నగరంలోని మారుతీనగర్‌లో ఉన్న స్నేహ సొసైటీలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరి సహకారంతో చేస్తున్న సమాజ సేవలకు ఈ గుర్తింపు లభించిందన్నారు. అనంతరం సిద్ధయ్యను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్‌ జ్యోతి, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాజేశ్వరి, నాన్సీ మంజుల విమల సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులోనే ఆగిన గుండె



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మాక్లూర్‌: ఆర్టీసీ బస్సులోనే ఓ ప్రయాణికుడు బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. తోటి ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌ జిల్లా నందిపేటలో బస్సు ఎక్కిన సుమారు 65 ఏళ్ల వృద్ధుడు నిజామాబాద్‌కు టికెట్‌ తీసుకున్నాడు. గాలిబ్‌నగర్‌ వరకు ప్రశాంతంగా ఉన్న వృద్ధుడికి గుండె పోటు రావడంతో మృతి చెందాడు. మృతుడి జేబులో కొంత నగదు తప్ప ఎలాంటి ఆధారాలు లభించలేదు. నిర్మల్‌ జిల్లాకు అనుసంధానంగా గోదావరిపై కొండూరు వంతెన పూర్తయినప్పటి నుంచి నిర్మల్‌ జిల్లా భైంసా, పలు ప్రాంతాల వా రు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తున్నారు. మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడో ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌ రావు తెలిపారు.

క్రైం కార్నర్‌

ట్రాక్టర్‌ ఢీకొని యువకుడి మృతి



రాజు(ఫైల్‌)

ఎల్లారెడ్డి: మొబైల్‌ షాప్‌లో పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తిని ట్రాక్టర్‌ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండలంలోని అడివిలింగాల గేట్‌ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గణేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలంలోని జల్దిపల్లి గ్రామానికి చెందిన గాండ్ల రాజు (30) ఎల్లారెడ్డిలోని ఓ మొబైల్‌ షాప్‌లో పనిచేస్తున్నాడు. పనులు ముగించుకొని రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా లక్ష్మాపూర్‌ నుంచి అడివిలింగాల వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజును స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'పుష్ప' మాదిరి కలప రవాణా..

రాజును ఢీకొన్న ట్రాక్టర్‌లో కలప రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించకపోవడం గమనార్హం. లక్ష్మాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌లో కలప చెక్కలు వేసి వాటిపై ఇసుకను పోసి సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అడివిలింగాలకు వెళ్తున్న సమయంలో అజాగ్రత్తగా ట్రాక్టర్‌ నడుపుతున్న డ్రైవర్‌ బైక్‌పై వస్తున్న రాజుని ఢీకొనడంతో మృతి చెందాడు. కలప, ఇసుక రవాణా చేస్తున్న వారికి అధికారులు అండగా నిలవడంతోనే వారు రెచ్చిపోతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిందితుడి అరెస్ట్‌



ఖలీల్‌వాడి: రైలులో ప్రయాణికురాలి నుంచి బంగారం ఎత్తుకెళ్లిన ఓ నిందితుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వేఎస్సై సాయిరెడ్డి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాలు.. ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురకు చెందిన నిందితుడు షేక్‌ ఇబ్రహీం నాగర్‌సోల్‌ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న మహిళ నుంచి నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని అపహరించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం నిందితుడిని అరెస్టు చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించేందుకు కృషి చేసిన సిబ్బంది హన్మాండ్లు, కుబేరుడు, రాములు, సలావుద్దీన్‌లను ఎస్సై అభినందించారు.

అన్నాసాగర్‌లో డైజోఫాం పట్టివేత



నిందితుడి అరెస్టు చూపుతున్న అధికారులు

ఎల్లారెడ్డిరూరల్‌: అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి నుంచి డైజోఫాంను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ షాకీర్‌ అహ్మద్‌ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అన్నాసాగర్‌లో రూట్‌ వాచ్‌ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న మొగులాగౌడ్‌ నుంచి 460 గ్రాముల డైజోఫాంను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సీఐ వెంట డీటీఎఫ్‌ సీఐ సుందల్‌సింగ్‌, ఎస్సై జలాలుద్దీన్‌ తదితరులు ఉన్నారు.

నేరేల్‌ తండాలో గంజాయి స్వాధీనం

గాంధారి మండలంలోని నేరేల్‌తండాలో 1.14 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ షాకీర్‌ అహ్మద్‌ బుధవారం తెలిపారు. నిజామాబాద్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ సీఐ స్వప్న ఆధ్వర్యంలో గాంధారి మండలంలోని నేరేల్‌ తండాలో గంజాయిని రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకొని దాడి చేశారు. ఈ దాడిలో నిందితులు దారావత్‌ రవీందర్‌, దారావత్‌ బిచ్యా, దారావత్‌ మీరాబాయి, బస్తి జనార్దన్‌ ఎక్సైజ్‌ సిబ్బందిపై దాడులు చేసి పరారైనట్లు సీఐ పేర్కొన్నారు. 1.14 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలువలో పడి ఒకరు..

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు నిజాంసాగర్‌ కాలువలో పడి సూర్యపేట్‌ జిల్లా రేపల గ్రామానికి చెందిన పింగిళి శ్రీనివాస్‌(45) మృతిచెందినట్లు ఏఎస్సై చిన్న గంగారాం తెలిపారు. బతుకుదెరువు నిమిత్తం గ్రామానికి వలస వచ్చిన శ్రీనివాస్‌ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం తాగిన మైకంలో ప్రమాదవశాత్తు కాలువలో పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక..

మోపాల్‌: మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింగ్‌పల్లికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో బాలికను మోసగించాడు. ఈనెల 18న బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టి యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన యువతి రాత్రి ఇంటికి చేరుకోలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

నస్రుల్లాబాద్‌: అనారోగ్యానికి గురైన ఓ వృద్ధుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లావణ్య బుధవారం తెలిపారు. మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన మామిడి రాములు (75) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో గ్రామ శివారులోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించి మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో గాయాలు

బిచ్కుంద: మండలంలోని ఖద్గాం గ్రామంలో పిచ్చికుక్కలు గ్రామస్తులపై బుధవారం దాడిచేసి గాయపర్చాయి. గత మూడు రోజుల నుంచి పిచ్చి కుక్కలు గ్రామస్తులు, పశువులపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో పాఠశాల చిన్నారులను బడులకు పంపాలంటేనే ప్రజలు జంకుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యానంపల్లిలో ఇసుక ట్రాకర్ల పట్టివేత

డిచ్‌పల్లి: యానంపల్లి శివారులో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. సుద్దపల్లి వైపు నుంచి యానంపల్లికి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు చెప్పారు.అనంతరం ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాబాపూర్‌లో ఇసుక ట్రాక్టర్‌..



భీమ్‌గల్‌: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్‌చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. మండలంలోని బాబాపూర్‌లో గణేశ్‌ అనే వ్యక్తి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంచిప్పలో బ్లేడ్‌ ట్రాక్టర్‌..

మోపాల్‌: మండలంలోని మంచిప్ప అటవీ ప్రాంత శివారులో అటవీ భూమిని చదును చేస్తున్న బైరాపూర్‌కు చెందిన బాదావత్‌ రవి బ్లేడ్‌ ట్రాక్టర్‌ను ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ సాయికుమార్‌, బీట్‌ ఆఫీసర్‌ సాయికృష్ణ ఆధ్వర్యంలో పోలీస్‌, అటవీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అటవీ భూమిని చదును చేస్తున్నట్లు అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. నాట్లు వేసేందుకు మాత్రమే చదును చేస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఈ భూమిలో కొన్నేళ్లుగా తాము ఆరుతడి పంటలు పండించుకుంటున్నామని తెలిపారు.